సాక్షి కామారెడ్డి

శనివారం । 21 । డిసెంబర్ । 2024



అటకెక్కిన నిర్మాణం

ఎల్లారెడ్డిలో ఏడాదిన్నర క్రితం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

- 9లో ▸



క్రమబద్ధీకరించాలి

వైద్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలంటూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.7 / 16.8

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వసతిగృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



లింగంపేట: వసతి గృహాల పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ సూచించారు. శుక్రవారం ఆయన లింగంపేట బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు, ఈగలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. జిల్లాలో 18 వసతి గృహాల్లో ప్యూరిఫయర్ యంత్రాలు పనిచేయడం లేదని, కలెక్టర్‌తో చర్చించి మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, పంచాయితీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వార్డెన్ రాజేశ్వర్ ఉన్నారు.

‘హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి’



కామారెడ్డి క్రైం : ''హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి'' అంటూ పట్టణ పోలీసులు శుక్రవారం పాఠశాలల విద్యార్థులతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. చిన్నారులు హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పువ్వును బహూకరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మహేష్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పశువైద్యాధికారుల సంఘం కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: జిల్లా పశు వైద్యాధికారుల సంఘం ఎన్నికలు గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.దేవేందర్, ఎన్నికల అధికారి రవికుమార్ పర్యవేక్షణలో శుక్రవారం పాతరాజంపేట డెయిరీలో జరిగాయి. అధ్యక్షుడిగా ఎం.వినీత్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా యు.శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎ.రవికుమార్, కార్యాలయ కార్యదర్శిగా ఆర్.రమేష్, కోశాధికారిగా టి.రామచందర్, ఉపాధ్యక్షులుగా వి.రవి, పండరీనాథ్, ఎస్.అనిల్‌కుమార్, మౌనికారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సయ్యద్ యూనస్, మణికుమార్, కె.హేమశ్రీ, సీహెచ్.అర్చన, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జైపాల్ సింగ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా మహేష్ నాయక్, జిల్లా కార్యవర్గసభ్యులుగా శృతిలయ, అనూష ఎన్నికయ్యారు.

శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కామారెడ్డి టౌన్: విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని డీఈవో ఎస్.రాజు సూచించారు. తెలంగాణ బయోసైన్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి జీవశాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. డీఈవో రాజు విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. సాందీపని కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, బయోసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి సురేష్, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాక

నిజామాబాద్‌అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. రెంజల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, జిల్లా కేంద్రంలో మాతా శిశు సంరక్షణ భవనాన్ని ప్రారంభిస్తారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉమ్మడి జిల్లా వైద్య అధికారులతో సమావేశమవుతారని పేర్కొన్నారు.

ఆర్టీసీకి మహాలక్ష్మి కళ!

- ఏడాదిలో 6 కోట్ల మంది మహిళల ప్రయాణం
- సంస్థకు రూ.223.60 కోట్ల ఆదాయం

నష్టాల బాటలో పయనిస్తున్న ఆర్టీసీని మహాలక్ష్మి పథకం ఆదుకుంది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఆరు బస్‌డిపోల ద్వారా 6 కోట్లకుపైగా మహిళలు ఉచితంగా ప్రయాణించారు. వీరి ద్వారా సంస్థకు రూ. 223.60 కోట్ల ఆదాయం సమకూరడం గమనార్హం.



బస్సు ఎక్కుతున్న మహిళలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఆరు బస్సు డిపోలున్నాయి. అన్ని డిపోలలో కలిపి 582 బస్సులున్నాయి. రీజియన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్‌లు 114, పల్లె వెలుగులు 317 ఉన్నాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గతేడాది డిసెంబర్‌లో ఈ పథకం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ పరిస్థితి మెరుగుపడింది. ఏడాది కాలంలో 6 కోట్ల మంది మహిళలు జీరో టికెట్లపై ప్రయాణించారు. వారి ప్రయాణ టికెట్ల విలువ రూ. 223.60 కోట్లు. బస్సు చార్జీ చెల్లించి ప్రయాణించిన వారు 3,10,50,600 మంది ఉన్నారు. వారి ద్వారా రూ.255.71 కోట్ల ఆదాయం వచ్చింది. ఉపాధి కోసం పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లే మహిళలకు ఈ పథకం ఒక వరంలా మారింది. అలాగే చదువుల కోసం వెళ్లే ఆడపిల్లలు కూడా ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం లభించింది. కొందరు మహిళలు తీర్థయాత్రలకు కూడా వెళ్తున్నారు. భద్రాచలం, వేములవాడ, బాసర, కొమురవెల్లి తదితర ప్రాంతాల్లోని ప్రముఖ ఆలయాలకు వెళ్లి దర్శనాలు చేసుకుంటున్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. ఇదే సమయంలో ఆటోవాలాలకు గిరాకీ తగ్గి వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు పెరగకపోవడం సమస్యగా మారింది. ఒక్కో బస్సులో వంద మందికిపైగా ప్రయాణం చేస్తున్నారు. దీంతో ప్రయాణికులతో పాటు ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం నిలబడడానికి స్థలం కూడా దొరకడం లేదు. కొన్నిసార్లు తోపులాటలతో గొడవలూ జరుగుతున్నాయి. ఆర్టీసీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది.

కామారెడ్డి డిపో పరిధిలో..

ఉమ్మడి జిల్లాలో ప్రయాణికులను తరలించడంలో కామారెడ్డి బస్ డిపో అగ్రస్థానంలో ఉంది. డిపోలో 89 పల్లె వెలుగులు, 11 ఎక్స్‌ప్రెస్‌లున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా 1,69,73,172 మంది ప్రయాణించగా.. సంస్థకు రూ.55.44 కోట్ల ఆదాయం వచ్చింది. ఇదే సమయంలో టికెట్లు తీసుకుని 76,24,373 మంది ప్రయాణించగా.. వారి ద్వారా రూ. 50.89 కోట్ల ఆదాయం సమకూరింది.

బాన్సువాడ డిపో..

ప్రయాణికులను తరలించడంలో నిజామాబాద్ రీజియన్‌లో బాన్సువాడ డిపో ద్వితీయ స్థానంలో ఉంది. ఈ డిపోలో 56 పల్లె వెలుగులు, 24 ఎక్స్‌ప్రెస్‌లున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా 1.01 కోట్ల మంది ప్రయాణించగా.. వచ్చిన ఆదాయం రూ. 37.45 కోట్లు. టికెట్లు తీసుకుని ప్రయాణించి వారి సంఖ్య 57,49,347 కాగా.. వారిద్వారా రూ. 29.94 కోట్ల ఆదాయం లభించింది.

నిజామాబాద్ - 2 డిపో..

నిజామాబాద్–2 డిపోలో 26 ఎక్స్‌ప్రెస్‌లు, 20 పల్లెవెలుగులున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా 63,04,600 మంది ప్రయాణించగా.. సంస్థకు రూ. 32.61 కోట్ల ఆదాయం వచ్చింది. టికెట్లు తీసుకుని 41,75,053 మంది ప్రయాణించారు. వారి ద్వారా రూ. 54.84 కోట్లు సమకూరాయి.

బోధన్ డిపోలో..

బోధన్ డిపోలో 18 ఎక్స్‌ప్రెస్‌లు, 54 పల్లె వెలుగులున్నాయి. మహాలక్ష్మి ద్వారా 91,19,707 మంది ప్రయాణించగా.. ఆర్టీసీకి రూ. 33.37 కోట్ల ఆదాయం వచ్చింది. టికెట్లు తీసుకుని ప్రయాణించిన వారు 60,83,240 మంది ఉండగా.. వారి ద్వారా రూ. 50.99 కోట్ల ఆదాయం సమకూరింది.

ఆర్మూర్ డిపోలో..

ఆర్మూర్ డిపోలో 14 ఎక్స్‌ప్రెస్‌లు, 48 పల్లె వెలుగులున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా 89,32,976 మంది ప్రయాణించారు. జీరో టికెట్ల ద్వారా సమకూరిన ఆదాయం రూ. 37.08 కోట్లు. టికెట్లు తీసుకుని ప్రయాణించిన వారు 34,94,206 మంది కాగా వచ్చిన ఆదాయం రూ. 28.88 కోట్లు.

నిజామాబాద్ - 1 డిపో..

నిజామాబాద్–1 డిపోలో 21 ఎక్స్‌ప్రెస్‌లు, 50 పల్లె వెలుగులున్నాయి. 85,73,065 మంది మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణించగా రూ. 30.62 కోట్ల ఆదాయం సమకూరింది. టికెట్లు తీసుకుని ప్రయాణించిన వారు 39,24,381 మంది కాగా.. వారి ద్వారా రూ. 40.14 కోట్ల ఆదాయం వచ్చింది.

నాణ్యమైన భోజనం అందేలా చూస్తాం



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పెద్దకొడప్‌గల్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూస్తామని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు గురువారం ఉడికీఉడకని అన్నం తిని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయమై శుక్రవారం ‘సాక్షి’లో ప్రచురితమైన వార్తపై జిల్లా అధికారులు స్పందించారు. వసతి గృహాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త బియ్యం రావడం వల్ల అన్నం ముద్దగా మారిందన్నారు. కొత్త బియ్యం స్థానంలో పాత బియ్యం పంపించామని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ వంట మనిషిని తొలగించి కొత్త వారిని ఏర్పాటు చేస్తామన్నారు. అందుబాటులో ఉండని హాస్టల్ వార్డెన్‌ను వేరే స్థానానికి పంపిస్తామన్నారు. అస్వస్థత కు గురైన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్, ఎస్సై మహేందర్, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆకలి బాధ తీరింది



విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిజాంసాగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తిరిగి ప్రారంభమైంది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో వంట చేయలేమంటూ ఏజెన్సీ నిర్వాహకులు చేతులు ఎత్తేయడంతో పాఠశాలలో 18 రోజులుగా వంట బంద్ అయ్యింది. ఈ విషయమై ‘సాక్షి’లో గురువారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పందించారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి పాఠశాలను సందర్శించి అధికారులు, మహిళలతో మాట్లాడారు. ఆమె విజ్ఞప్తి మేరకు వంట చేయడానికి మహిళలు ముందుకు వచ్చారు. దీంతో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందింది. మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి శ్రీపతి, ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో తిరుపతిరెడ్డి తనిఖీ చేశారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

పిట్లం(జుక్కల్): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేయాలని, బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికలకు వెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార సూచించారు. మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు అభినయ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అరుణతార హాజరై మాట్లాడారు. జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రాము, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు అశోక్ రాజ్, మండల ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు అక్షయ పటేల్, జగదీష్, బెజుగం నరసింహులు, అనిల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివాజీ రావ్, తదితరులు పాల్గొన్నారు.

‘సర్కారు వారి పాట’.. వాయిదా

- సొసైటీలో పదేళ్ల క్రితం రూ. 3.70 లక్షల రుణం
- వడ్డీతో కలిపి రూ. 10.29 లక్షలకు చేరిన వైనం
- రికవరీకోసం చర్యలు చేపట్టిన బ్యాంకు అధికారులు
- కొంత మొత్తాన్ని చెల్లించడంతో 15 రోజుల గడువిచ్చిన బ్యాంకర్లు



బ్యాంకు అధికారులకు అప్పు చెల్లిస్తున్న రైతు

నస్రుల్లాబాద్ : తీసుకున్న అప్పు తీర్చకపోవడంతో రైతు పొలాన్ని వేలం వేయాలని నిర్ణయించారు సహకార బ్యాంకు అధికారులు. రైతు పాక్షికంగా కొంత మొత్తాన్ని చెల్లించడంతో వేలాన్ని వాయిదా వేశారు. వివరాలిలా ఉన్నాయి. అంకోల్ తండాకు చెందిన రైతు అనూష బాయి 2013–14లో నిజామాబాద్ సహకార బ్యాంకు నస్రుల్లాబాద్ శాఖలో భూమి అభివృద్ధి పనులకోసం రూ. 3.70 లక్షలు అప్పు తీసుకున్నారు. బోర్లు ఫెయిల్ కావడం, పంటలు సరిగా పండకపోవడంతో అప్పు తిరిగి చెల్లించలేకపోయారు. అది వడ్డీతో కలిపి రూ. 10.29 లక్షలు అయ్యింది. దీంతో బ్యాంకు అధికారులు ఆమె భూమిని వేలం వేయాలని నిర్ణయించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలానికి ఏర్పాట్లు చేశారు. అయితే రైతు కొంత మొత్తాన్ని చెల్లించడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు బ్యాంకు అధికారులు ప్రకటించారు. రూ. 2 లక్షల అప్పు చెల్లించారని, మిగతా మొత్తాన్ని 15 రోజుల్లో చెల్లిస్తానని ఒప్పుకోవడంతో వేలాన్ని వాయిదా వేశామని డీఆర్‌వోఎస్‌డీ వసంత తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంకు మేనేజర్ సందీప్, సిబ్బంది నాగభూషణం, భూమేష్, సహకార సంఘాల సీఈవోలు నరేందర్, శ్రీనివాస్, మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- పొతంగల్ కలాన్ హైస్కూల్ పరిశీలన



డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థిని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



చిన్నారిని ఎత్తుకుని..

గాంధారి : ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కష్టపడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌తో కలిసి పోతంగల్ కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, వంట గది, బియ్యంతో పాటు వంటలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థినికి ఓ ప్రశ్న సంధించగా ఆమె దాన్ని పరిష్కరించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో రాజుకు సూచించారు. అనంతరం ఆయన ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో సరదాగా మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని కేంద్రంలో దారంతో వేలాడదీసిన బొమ్మల పేర్లు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో పాటలు పాడించి సంబురపడ్డారు. గాంధారి జీపీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీడీవో రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంపీవో లక్ష్మీనారాయణ, ఏవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణంగడ్డ తండావాసుల అసంతృప్తి

పోతంగల్ కలాన్‌లో పర్యటించిన కలెక్టర్‌ను తమ గ్రామానికి రావాల్సిందిగా కర్ణం గడ్డ తండావాసులు కోరారు. కొందరు కలెక్టర్ కాళ్లు పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన తండాను సందర్శించడానికి సుముఖత వ్యక్తం చేయగా.. అధికారులు సర్దిచెప్పారు. దీంతో కర్ణంగడ్డ తండాకు వెళ్లకుండానే వెనుదిరిగారు. అధికారుల తీరుపై తండావాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తండాను పరిశీలిస్తే సమస్యలు తెలుస్తాయని, వాటి పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం బయట పడుతుందని ఇలా చేశారని ఆరోపిస్తున్నారు.

బోనమెత్తిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉద్యోగులు బోనాలతో ఊరేగింపు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరం నుంచి కొత్త బస్టాండ్ వద్ద ఉన్న మైసమ్మ ఆలయం వరకు ఊరేగింపు సాగింది. సమగ్ర శిక్ష ఉద్యోగులు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా అనుగ్రహించాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కేజీబీవీలకు తాళాలు వేసి డీఈవోకు అప్పగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఉద్యోగులు

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన కబడ్డీ బాలుర జట్టు సభ్యులు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని లయోల హైస్కూల్‌లో శుక్రవారం అండర్–20 బాల బాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన బాలికల జట్టు ఆదివారం హకీంపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్వరగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాలుర జట్టు ఈనెల 27న జనగామలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, అనిల్‌కుమార్, లక్ష్మణ్‌రాథోడ్, రాజేందర్‌రెడ్డి, రేణుక, విజయలక్ష్మి, సభాత్ రవి, సంజీవులు, నిరంజన్ పాల్గొన్నారు.

బాలికల జట్టు : కావ్య, హార్థిక, సుచరిత, కవిత, సంధ్యారాణి, ఉష, శృతి, మౌనిక, నిఖిత, లక్ష్మీప్రసన్న, కీర్తన, రిషిక, శిరీష, సునైన, జ్యోతి.

బాలుర జట్టు : వంశి, శివస్వామి, నవీన్, విఠల్, ఆంజనేయులు, ప్రహ్లాద్, అరవింద్, సంపత్, అజయ్‌కుమార్, మహేష్, రాంసింగ్, నీరజ్‌కుమార్, వెంకటేష్, గణేష్, సంపత్.



ఎంపికైన కబడ్డీ బాలికల జట్టు సభ్యులు

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



బాన్సువాడ: చిన్న రాంపూర్ కుర్దు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ప్రతి రోజు శుభ్రమైన కురగాయలను వండాలని అన్నారు. మధ్యాహ్న భోజనం వండే సమయంలో ఉపాధ్యాయులు పరిశీలించాలని సూచించారు. ఉపాధ్యాయులు నక్క ప్రవీణ్, వెంకటరమణ తదితరులున్నారు.

బీబీపేటలో..



బీబీపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎంఈవో అశోక్ పరిశీలించారు. ఎప్పటికప్పుడు కూరగాయలు తీసుకువచ్చి వండాలని పేర్కొన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో పైడి ఎల్లారెడ్డి పూజలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అతి పురాతన కోదూరి హనుమాన్ ఆలయంలో ప్రముఖ శాస్త్రవేత్త, బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి శుక్రవారం పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధికి రూ. 2లక్షల నిర్మాణ సామగ్రి అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనని ఘనంగా సత్కరించారు. వేద పండితుడు ఆంజనేయశర్మ, ప్రతినిధులు నర్సింలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేస్తే ఇల్లు గుల్లే..

- విలీన గ్రామాల్లో దొంగల హల్‌చల్
- భయాందోళనలో ప్రజలు



గూపన్‌పల్లిలో ఇటీవల ఓ ఇంట్లో జరిగిన చోరీ (ఫైల్)

నిజామాబాద్ రూరల్: నగర మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల్లో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసిన ఇళ్లనే దుండగులు టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతుండటంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి, వెళ్లాలంటే జంకుతున్నారు.

ఇదీ పరిస్థితి..

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, మారూతీనగర్‌లలో గత నెల రోజులుగా తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకోని చోరీలకు పాల్పడుతున్నారు. పది హేను రోజుల కిందట ముబారక్‌నగర్‌లోని ఆలయంలో దొంగలు హుండీని పగులు కొట్టి నగదును దోచుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం ముబారక్‌నగర్‌లోని రెండిళ్లలో దుండగులు చొరబడి 11 తులాల బంగారం చోరీ చేశారు. విలీన గ్రామాల్లో గత సంవత్సరంలో దాదాపు 10 ఇళ్లను దొంగలు దోచుకుని పోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. విచారణలు చేపట్టారు. కానీ ఆయా ఘటనల్లో పోలీసులు ఇప్పటికీ ఎవరినీ అదుపులోకి తీసుకున్న దాఖలాలు లేవు.

పెట్రోలింగ్ కరువు..

ప్రస్తుతం శుభకార్యాలతోపాటు సెలవులు వస్తుండటంతో ప్రజలు దూరప్రయాణాలు చేయాల్సివస్తోంది. కానీ వరుస చోరీలతో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నేరాల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతోపాటు పెట్రోలింగ్ నిర్వహించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగ తనాలు జరుగున్న ప్రాంతాలు అన్నీ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా, చోరీలు జరగడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి, విలీన గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, చోరీల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేటీఆర్, హరీశ్‌కు జైలు తప్పదు

- ఫార్ములా రేస్‌లో రూ.55 కోట్ల అవినీతి
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

నిజామాబాద్ సిటీ: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావులకు జైలు జీవితం తప్పదని డీసీసీ అధ్యక్షుడు, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా రేస్‌లో రూ.55 కోట్ల మేర అవినీతి జరిగిందని, తప్పుచేయనప్పుడు కేటీఆర్‌కు భయమెందుకని ప్రశ్నించారు. ఈ కేసులో గవర్నర్ అనుమతితోనే ఎమ్మెల్యే కేటీఆర్‌పై కేసు నమోదుచేశారని తెలిపారు. దీంతో గులాబీనేతలు కాంగ్రెస్‌పైన, సీఎం రేవంత్‌రెడ్డిపైన అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే అవుటర్ రింగ్‌రోడ్డు అంశంలో హరీశ్‌రావు సైతం జైలుకు వెళ్లక తప్పదన్నారు. ప్రభుత్వానికి రూ.18 వేల కోట్లు వచ్చే ఆదాయాన్ని కేవలం రూ.7,300 కోట్లకు కాంట్రాక్టు ఇచ్చిన హరీశ్‌రావుపై కూడా విచారణ జరుగుతుందన్నారు. తప్పుచేసినట్లు తేలితే ఆయన కూడా జైలుకు వెళ్లక తప్పదన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి: తాహెర్‌బిన్ హందాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నూడా చైర్మన్ కేశవేణు, నాయకులు అపర్ణ, రత్నాకర్, కేశ మహేష్, వేణు రాజ్, సంతోష్, నరేందర్ గౌడ్ ఉన్నారు.

నకిలీ బంగారం విక్రయించిన వారిపై కేసు నమోదు

సిరికొండ: మండలంలోని పోత్నూర్ గ్రామానికి చెందిన బొందల మహేష్ అనే వ్యక్తికి నకిలీ బంగారం అంటగట్టిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మహేష్‌కు ఇటీవల రమేష్ అనే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మైసూర్‌లో జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నానని తెలిపాడు. జేసీబీ తవ్వకాల్లో తనకి ఒక కుండ దొరికిందని, కుండ నిండా బంగారం ఉందని, దాని బరువు మూడు కిలోల వరకు ఉంటుందని తెలిపాడు. ఆ బంగారంను తక్కువ ధరకే ఇస్తానని నమ్మబలికాడు. కావాలంటే వచ్చి దాన్ని చెక్ చేసుకోవచ్చు అని తెలపడంతో మహేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా మదనపల్లికి వెళ్లాడు. మహేష్‌కు అతడు ఒక గ్రాము బంగారం ఇవ్వగా చెక్ చేయించగా నిజమైన బంగారంగా తేలింది. దీంతో తన వద్ద ఉన్న బంగారంను రూ.తొమ్మిది లక్షలకు అమ్ముతానని రమేష్ తెలిపాడు. తన వద్ద రూ.ఏడు లక్షలు మాత్రమే ఉన్నాయని మహేష్ చెప్పగా ఆ డబ్బులను తీసుకొని, బంగారం ఇచ్చాడు. అనంతరం ఆ బంగారాన్ని మహేష్ పరీక్షించగా నకిలీదని తేలింది. దీంతో తనని నమ్మించి మోసం చేసిన రమేష్, మరో ఇద్దరిపై మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమాచారం..

నేడు అలీసాగర్ నీటి విడుదల

నవీపేట: మండలంలోని కోస్లీ శివారులోని గోదావరి నది ఒడ్డుపై గల అలీసాగర్ ఎత్తిపోతల పథకం నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం సాగునీటిని విడుదల చేస్తారని ఏఈ ప్రణయ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రబీ పంటల సాగుకు ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నవీపేట, రెంజల్, ఎడపల్లి, నిజామాబాద్, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాల పరిధిలోని 53,793 ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా విలువిద్య పోటీలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22 ఉమ్మడి జిల్లా(నిజామాబాద్, కామారెడ్డి)లకు సంబంధించి సబ్ జూనియర్ విభాగంలో విలువిద్య(అర్చరీ) పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజారం స్టేడియంలో ఆదివారం ఉదయం 8గంటలకు బాలబాలికలకు ఎంపికల పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9848919480ను సంప్రదించాలన్నారు.

అనువాదం బహుళ ప్రయోజనాన్ని కలిగి ఉండాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్
- తెయూలో కొనసాగుతున్న పునశ్చరణ తరగతులు



ప్రసంగిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్

తెయూ(డిచ్‌పల్లి): అనువాదమనేది బహుళ ప్రయోజనాన్ని కలిగి ఉండాలని, సామాజిక మాధ్యమాలలో అనువాదం ముఖ్య పాత్రను పోషిస్తుందని, ప్రముఖ అనువాదకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (భారతీయ భాషా విభాగాల సంస్థ), రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు కొనసాగుతున్నాయి. మూడోరోజు శుక్రవారం కార్యక్రమంలో కీలక ఉపన్యాసకులుగా వారాల ఆనంద్ హాజరై, 'అనువాదం మెలకువలు' అనే అంశంపై మాట్లాడారు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన రామాయణ కల్పవృక్షాన్ని ఇతర భాషల్లోకి అనువాదం చేయగలిగితే తెలుగు భాషకు ఇంకా వైభవం తీసుకువచ్చిన వాళ్లమవుతామని పేర్కొన్నారు. తెలుగులోని గొప్ప రచనలను ఇతర భాషల్లోకి అనువాదం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల్లో అనువాదం పట్ల ఉన్న భయాన్ని తొలగించి అనువాదం ఎంత సులభం చేయవచ్చో చిన్న చిన్న కథల ద్వారా తెలియజేయాలని అధ్యాపకులకు సూచించారు. రచయిత రావూరి సీతారామారావు 'వచన కవితా బోధన వ్యూహాల'పై మాట్లాడుతూ.. విద్యార్థికి కవిత్వాన్ని తెలుపుతూనే వారిలో సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. కవి, విమర్శకుడు గంధ్ర లక్ష్మణరావు 'పద్య బోధన- మెలకువలు' అనే అశంపై మాట్లాడారు. తెయూ మాజీ రిజిస్ట్రార్ కనకయ్య మాట్లాడుతూ.. సాహిత్యం సమాజం యొక్క ప్రతిబింభమని, సాహిత్యంలో ఉన్న ప్రక్రియల పట్ల అధ్యాపకులకు అవగాహన ఉండాలన్నారు. నిర్వాహకురాలు కరిమండ్ల లావణ్య, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు లక్ష్మణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ నుంచి గన్, బుల్లెట్ స్వాధీనం





నిందితుడు శ్రీహరి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసులు చైన్ స్నాచర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద గన్, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి ఒకటో టౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో ఆ వ్యక్తిని పలు చైన్ స్నాచింగ్ కేసులు నమోదైన నిందితుడు శ్రీహరి దేవిదాస్ శర్మ అలియాస్ హర్యా అలియాస్ హరీశ్‌గా పోలీసులు గుర్తించారు. ఇటీవల చైన్ స్నాచింగ్ చేసి వెళ్తుంటే అడ్డు వచ్చిన వ్యక్తిని కత్తితో దాడి చేశాడు. అలాగే బర్సాత్ అమీర్ గ్యాంగ్‌తో కలిసి మూడు నేరాలలో నిందితుడిగా ఉన్నాడు. నేరాలు చేయడానికి, బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు వెపన్ అవసరమని భావించిన శ్రీహరి నాందేడ్‌కు చెందిన రవిలాల నుంచి రూ. 30 వేలకు దేశీ తుపాకి, ఒక రౌండ్ కొనుగోలు చేశాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ సింధూశర్మ తెలిపారు.

పీజీ పరీక్ష కేంద్రాల తనిఖీ



తెయూ (డిచ్‌పల్లి): తెయూలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రంలో జరుగుతున్న పీజీ పరీక్షలను వర్సిటీ వీసీ యాదగిరిరావు శుక్రవారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పీజీ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ, ప్రాక్టికల్), ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు మొదటి సెమిస్టర్, ఎల్ఎల్బీ, ఐఎంబీఏ 7వ, 9వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. పరీక్షలకు 151 మంది విద్యార్థులకు గానూ 148 మంది విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. అడిషనల్ కంట్రోలర్ సాయిలు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం దేవునిపల్లి మల్లన్న

- మల్లన్న జాతరకు సర్వం సిద్ధం
- నేటి నుంచి దేవునిపల్లిలో మల్లన్న ఉత్సవాలు



కొలువుదీరిన మల్లన్న, మేడాలమ్మ, గోల్లకేతమ్మ

కామారెడ్డి రూరల్: కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగు బంగారంగా పేరొందిన దేవునిపల్లి మల్లన్న జాతర ఉత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మల్లన్న జాతరకు సర్వం సిద్ధం అయ్యాయి. నాలుగు రోజుల పాటు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఈ ఉత్సవాలకు జిల్లాలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వీడీసీ అధ్యక్షుడు గూడెల్లి గంగారం, ఉపాధ్యక్షులు వంగ రాహుల్‌కుమార్, నిట్టు లింగారావులు. వీడీసీ ప్రతినిధులు కోరారు.

ముమ్మరంగా చెరకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి లక్షా 25 వేల 113 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అత్యాచారానికి యత్నించిన వ్యక్తి రిమాండ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఓ వివాహితపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మహేందర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని బేగంపూర్ గ్రామంలో ఈనెల 15న గ్రామానికి చెందిన పెండ్యాల విజయ్ కుమార్ అదే గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా, ఆమె కేకలు వేసింది. వెంటనే స్థానికులు అతడిని పట్టుకోవడానికి వెంటపడగా తప్పించుకున్నాడు. అనంతరం వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విజయ్ కుమార్ బేగంపూర్ గ్రామ శివారులో ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కల్లు దుకాణంపై దాడి

వర్ని: మోస్రా మండల కేంద్రంలోని సుభాష్‌గౌడ్ కల్లు దుకాణంపై శుక్రవారం ఒక వర్గం వారు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు వారు వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు గౌడకులస్తులు అకారణంగా కల్లు దుకాణంపై దాడి చేసి పెట్టెలు, కల్లును ధ్వంసం చేసినట్లు బాధితుడు వాపోయాడు.

వైన్స్ దుకాణంలో చోరీ



పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెల చెరువు గ్రామంలో గల వైన్స్ దుకాణంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వైన్స్ షాప్ షెట్టర్లు శుక్రవారం ఉదయం కొద్దిగా తెరిచిఉండటంతో స్థానికులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రూ. 2వేల నగదు, కొన్ని మద్యం సీసాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్.. బోల్తా పడ్డ ఆటో



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని కామిశెట్టిపల్లి వద్ద గల జాతీయ రహదారిపై శుక్రవారం ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కామిశెట్టిపల్లిలోని జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద బాన్సువాడ నుంచి నిజామాబాద్ వెళుతున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఎస్సై లావణ్య ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో ఆటో నడపడంతో ప్రమాదం జరిగిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ హరిచంద్, భాను, బుజ్జి తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని రౌడీ షీటర్ అమర్ అలీఖాన్ అలియాస్ బర్సాత్ అమెర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఖిల్లా చౌరస్తాలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని, కత్తి, పల్సర్ బైక్, రెండు స్మార్ట్ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతడిపై ఆరో టౌన్‌లో రౌడీ షీట్ ఉండగా హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో ఏకే-302 పేరుతో ఓ ముఠాను సైతం నిర్వహించినట్లు తెలిపారు. నిందితుడు పలు కేసుల్లో వాంటెడ్‌గా ఉండగా, పరారీలో ఉండటంతో అతడిపై పీడీ చట్టం అమలు చేసి, అరెస్టు చేశామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. అలాగే బోధన్‌కు చెందిన ఓ వ్యక్తి అమెరికాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.



మృతి చెందిన డానియల్

వర్ని: మండలంలోని మల్లారం శివారులో ఓ వ్యక్తి బైక్ పైనుంచి పడి మృతిచెందినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడకు చెందిన మున్నంగి డానియల్ (30) శుక్రవారం బోధన్ వైపు నుంచి బాన్సువాడకు బైక్‌పై బయలుదేరాడు. మల్లారం అటవీప్రాంతంలో అతడికి కోతుల మంద అడ్డురావడంతో వాటిని తప్పించబోయి, అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎక్స్‌ఎల్‌ను లారీ ఢీకొట్టడంతో..



బాబయ్య(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ గ్రామ స్టేజీకి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. సదాశివనగర్‌కు చెందిన కుప్రియాల్ బాబయ్య(68) టీవీఎస్ ఎక్సెల్‌పై గ్రామానికి వస్తుండగా నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టడంతో బాబయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ద్విచక్ర వాహనం లారీకి ఇరుక్కుని సుమారు 10 మీటర్ల దూరం వరకు లాక్కుపోయింది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజీత్ తెలిపారు.

ఉన్నత విద్య కోసం వెళ్లి.. తిరిగిరాని లోకాలకు..



నీరజ్ గౌడ్ (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): పట్టణానికి చెందిన శంకర్, నలినీల దంపతుల కుమారుడు నీరజ్ గౌడ్ (23) ఈనెల 16న అమెరికాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా.. నీరజ్ గౌడ్ ఉన్నత విద్య కోసం గతంలో అమెరికా వెళ్లాడు. ఈ నెల 16న నిజామాబాద్‌కు చెందిన శ్రీధర్ నాయక్‌తో కలిసి నీరజ్‌గౌడ్ కారులో అమెరికాలోని బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి, తిరిగివస్తుండగా తీవ్రమైన మంచు కురిసింది. దీంతో వారి కారు అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న పోలీసు పెట్రోలింగ్ కారును ఢీకొట్టింది. ఈఘటనలో నీరజ్ గౌడ్‌కు తీవ్ర గాయాలు అవ్వగా, మిత్రుడు శ్రీధర్‌కు, పోలీసు వాహనంలో ఉన్న సిబ్బందికి సైతం గాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా నీరజ్‌గౌడ్ మార్గమధ్యలోనే మృతి చెందాడు. మరో రెండు నెలల్లో ఉన్నత విద్యను పూర్తి చేసుకొని స్వదేశానికి తిరిగి రావాల్సి ఉండగా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. నీరజ్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నట్లు మృతుడి బంధువులు వెల్లడించారు.

11.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాన్సువాడకు చెందిన అబ్దుల్ రహీం శుక్రవారం పేట్‌సంగెం నుంచి బొలెరో వాహనంలో 11.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోతంగల్ కలాన్ స్టేజీ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అబ్దుల్ రహీం పేట్‌సంగెంలో బియ్యం దాచి, అక్కడి నుంచి బాన్సువాడ మీదుగా మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండల పరిధిలోని మహిపాల్ తండా వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రామ్ శుక్రవారం తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మరియాల గ్రామానికి చెందిన తేజావత్ అఖిల్ తన బైక్‌పై 180 కిలోల రేషన్ బియ్యంను తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్‌తో కలిసి పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

దుకాణ సముదాయం ఇప్పిస్తానని మోసం

- ఓ మహిళకు రూ.25లక్షలు టోకరా
- నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లో వాణిజ్య సముదాయం ఇప్పిస్తానని నమ్మబలికి ఓ మహిళ వద్ద నుంచి రూ. 25లక్షలు తీసుకొని మోసం చేసిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్ పంపినట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన బాధితురాలికి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఒక వాణిజ్య దుకాణం ఇప్పిస్తానని అహ్మద్‌ఖాన్ మాయమాటలు చెప్పి, రూ. 25లక్షలు తీసుకున్నాడన్నారు. బాధితురాలు సదరు ప్రదేశానికి వెళ్లి చూడగా అక్కడ ఎలాంటి నిర్మాణం లేకపోవడంతో అహ్మద్ ఖాన్ తనను మోసం చేశాడని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బులు అడిగితే తనను చంపేస్తానని బెదిరించినట్లు బాధితురాలు తెలిపింది. పోలీసులు విచారణ చేపట్టగా నిందితుడు అమాయక ప్రజలను నమ్మించి, మోసం చేస్తున్నాడని తేలిందన్నారు. నిందితుడిని నాలుగో టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించారు.

నగరంలో వ్యక్తి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోనిదుబ్బ ఏరియాకు చెందిన తిరుమల వేణు(35)ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. వేణుకు పదేళ్ల కిందట వివాహం కాగా, ఏడాది క్రితం విడాకులు అయ్యాయి. కొన్ని నెలలక్రితం అతడికి నవనీత అనే యువతితో రెండవ పెళ్లి జరిగింది. కానీ అతడు నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను ఇబ్బందులకు గురిచేయడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వేణు మనస్థాపం చెంది, తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

వర్ని: మండలంలోని కూనిపూర్ శివారులోగల ఫారెస్ట్ భూమిలో ఇటీవల అక్రమంగా చొరబడి భూమి కబ్జాతోపాటు బోర్ వేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వర్ని అటవీరేంజ్ అధికారి గంగాధర్ శుక్రవారం తెలిపారు. జలాల్పూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఐదు రోజుల క్రితం రాత్రి సమయంలో భూమి కబ్జా చేయడంతో పాటు బోర్ వేశారన్నారు. ఈమేరకు స్థానికులు సంబంధిత అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపి, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.